బంగారుపొయ్యి

ఉద్యోగిని తరచుగా ఎదుర్కొనే సమస్య పెండింగ్ ఫైలు. ఏ ముహూర్తానో వో కాగితం చేతికందుతుంది. దానిపైన సముచితమైన చర్య తీసుకోవలసిందని ఆఫీసరు హెచ్చరిస్తారు. ఆ సముచితమైన చర్య ఏమిటో ఉద్యోగికి బోధపడదు. ఒకవేళ బోధపడిందనుకోండి! ఆ చర్యను అమల్లో పెట్టడానికి వీల్లేని పరిస్థితులు దాపురిస్తాయి. కొన్ని కొన్ని సందర్భాల్లో ఒక్కొక్క ఫైలు నెలల తరబడి సంవత్సరాల తరబడీ గూడా పెండింగులో వుండిపోతుంది.

అడ్వొకేటు సత్యారావు కథ నా పాలిటికలా ఒక పెండింగు ఫైలుగా వుండిపోయింది. మధ్యమధ్యలో ఎన్నో రిమైండర్లు. వచ్చిన చిక్కేమిటంటే దీన్ని క్లోజ్ చెయ్యడానికి నా ఊహాగానాలేవీ పనికిరావు. పనిగట్టుకుని కొంత శ్రమకు లోనుగావాలి. మొదట సత్యారావు స్టేట్‌మెంటులోని నిజానిజాలను పరిశీలించాలి. పరిశీలించాలంటే అతడితో నాకు కాస్త సాన్నిహిత్యం వుండడం అవసరం. నాకూ, సత్యారావుకూ మధ్య లేని సంబంధం అదే! సత్యారావు నాకు పరిచితుడుగాడు. కనీసం మా వూరివాడైనా కాదు. అరవై మైళ్ళు బస్సులో ప్రయాణం చేసిన తర్వాత మాత్రమే నేనతణ్ణి దర్శించగలగడం సాధ్యమౌతుంది.

ఇంతకూ సత్యారావన్న మాటేమిటో తమకు మనవి చెయ్యాలి. దాదాపు వెయ్యి మంది శ్రోతల్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ సత్యారావు ఆ మాటన్నాడు. నాటికీ నేటికీ నా మట్టుకు నేను మాత్రం అదెంతో సాహసంతో కూడుకున్నమాటగానే భావిస్తున్నాను. అడ్వొకేటుగదా! వృత్తిధర్మానికి అనుగుణ్యమైన వాక్చాతుర్యంతో అతడు వీలయినంత సహజంగా, అవసరమైనంత వినయ పూర్వకంగా తన స్టేట్‌మెంటును బయట పెట్టాడనిగూడా ఒప్పుకుంటాను.

అయ్యలారా! అన్యథా భావించకపోతే నేనొకమాట చెప్పాలి. దయచేసి అతిశయోక్తి అనుకోకండి! ఆత్మస్తుతిగా భావించకండి. మాది అన్యోన్య దాంపత్యమనీ, మేము ఆదర్శ దంపతులమనీ మమ్మల్ని తెలిసినవాళ్ళందరూ అనుకుంటారు. అదే నా విశ్వాసంగూడా!" అన్నాడు సత్యారావు.

నిజం చెప్పొద్దూ! 'ఓరి పిట్టపిడుగా!' అనుకున్నాను.

ఎందుకంటారా! నాకు అన్యోన్య దాంపత్యంపైన ఏమంత నమ్మకంలేదు. ఇంటింటికీ ఒక జంటను చూస్తున్నాం. దేవుడు దయదలిస్తే ఒకే యింట్లో రెండుమూడు జంటలుగూడా! మచ్చుకు మనకు బాగా ఎరుకలోవున్న పదిపన్నెండు కాపురాల్ని పరిశీలించినా సరే. అన్యోన్య దాంపత్యమనేది వట్టి నేతి బీరకాయ చందమని తేలిపోతుంది. భార్యాభర్తల్లో ఒకరు తోడేలయితే, యింకొకరు మేకపిల్లలావుండే ఉదంతాలనేకం! కొన్నిచోట్ల ఆలుమగల్లో ఒకరు నిప్పయితే యింకొకరు ఉప్పు. పైకి చూడ్డానికి కొన్ని కాపురాల్లో సామరస్యం నెలకొని వున్నట్టే తోస్తుంది. కానీ లోపల్లోపల ఎన్నో లొసుగులుంటాయి. పుక్కిటి కథలో రేచుక్క, పగటిచుక్కలకు మల్లే కొందరు భార్యాభర్తలకు బ్రతుకంతా ఎత్తుకు పైఎత్తు వేయడంతోనే సరిపోతుంది. పతినే దైవంగా భావించే పతివ్రతల చిత్తశుద్ధిపట్ల

నాకు నమ్మకం చాలా తక్కువ. ఎంతటి తప్పుచేసినా మన్నించగలిగినవాడే దేవుడు. మామూలు మనిషికి అంతటి ఔదార్యము, ఔన్నత్యము వుంటాయనుకోడం భ్రమ. మగవాణ్ణి అలా ఉబ్బించడానికి వెనుక భార్యకు స్వప్రయోజనాలను నెరవేర్చుకునే ఆకాంక్ష వుంటుందని నా అనుమానం. పోతే భర్త తిట్టినా, కొట్టినా మారు మాటాడకుండా వూరుకునే ఆడవాళ్ళని ఎందుకు గౌరవించాలో నాకు బోధపడదు. జీవచ్ఛవాలకు వాళ్ళకూ తేడా ఏమిటో తెలుసుకోవాలనిపిస్తుంది. ఇందులో మనవాళ్ళు నెల తక్కువగా పుట్టిందేమీ లేదు. వాళ్ళల్లో పతివ్రతలున్నట్టే, వీళ్ళల్లోనూ భార్యా విధేయులుంటారు. ఇంకొక మెట్టు పైకి వెళ్ళి భార్యల్ని ఆరాధించే వాళ్ళ మాటేమిటంటారు? తన భార్యను తానొక దేవతగా చూచుకుంటాననే వ్యక్తిని నేను స్వయంగా ఎరుగుదును. మొదటితరగతి ఆడఖైదీకి మగ కాపలాదారుకన్నా అతడి వ్యవహారం ఏమంత మెరుగ్గా లేదు.

ఇలా అన్ని యిళ్ళల్లోనూ మట్టిపొయ్యే వున్నట్టు బుజువవుతుంటే తన యింట్లో బంగారుపొయ్యి వుందన్నాడు సత్యారావు!

అసలీ బంగారుపొయ్యి ప్రస్తావన ఏ సందర్భంలో వచ్చిందో చెప్పాలి. రెండేళ్ళ క్రిందటి సంగతి. ఏదోపనిమీద జిల్లా ముఖ్య పట్టణానికి వెళ్ళాను. వెళ్ళినపని మరునాటికి వాయిదా పడింది. వెళ్ళినరోజు సాయంకాలం ఏం చేయడానికి పాలుపోక షికారుగా రాజవీధిగుండా నడచిపోతున్నాను. ఒకచోట కిటకిటలాడిపోతున్న జనసమూహం నాకు అడ్డొచ్చింది. ఐతే వాళ్ళు నాకెదురుగా రావడంలేదు. రోడ్డు కడ్డంగా ఎక్కడికక్కడే ఒక తటాకంలా నిలబడిపోయి వున్నారు. జనాన్ని చూచేసరికి కాలక్షేపానికి అనువుగా అక్కడేదైనా విశేషం జరుగుతూ వుండొచ్చుననే అనుకున్నాను. దగ్గరికి వెళ్ళాక తెలిసింది. పురమందిరంలో జరుగుతున్నది సన్మానసభ. హాలు నిండిపోయి, వసారా నిండిపోయి, సోపాన పంక్తుల దగ్గరినుంచీ రోడ్డు అంచులదాకా శ్రోతలు విస్తరించి వున్నారు. సన్మానసభకు యింతమంది రావడం అపూర్వమే! ఒక్కటే ఎక్సెప్షన్– సినిమాతారలకు జరిగే సన్మానం. సినీతారల తర్వాత అంతటి గ్లామర్ మంత్రుల కుండడం చూస్తున్నాం. ఇక్కడ సన్మానితుడు మంత్రికాడు సరిగదా, మంత్రులచుట్టూ తిరిగేవాడైనా కాడు. సినీనటుడు కాకపోతే మానే, సినిమా రచయితైనా కాదు. ప్రఖ్యాత ప్రజాకవి దయానిధిగారికి సన్మానమని నల్లబల్లపైన ప్రకటన కనిపించేసరికి తెల్లబోయాను.

దయానిధిగారితో నాకు వ్యక్తిగత పరిచయం లేకపోయినా ఆయన వ్యక్తిత్వం గురించి కొన్ని వివరాలు తెలుసు. ఏవో నాలుగైదు రకాల ఉద్యోగాలుచేసి, పై అధికారులతో అభిప్రాయభేదం రావడంవల్ల ఆయన అన్నింటికీ ఉద్వాసన చెప్పేశాడు. ఎన్నికల ప్రచారానికి పనికొచ్చే రచనలు చేయడానికి నిరాకరించి పెద్దలతో విరోధం కొని తెచ్చుకున్నాడు. దేశంలో పత్రికలంటూ కొన్ని వున్నాయి గనుక ఆయన రచనలు వెలుగులోకి వచ్చే అవకాశం కలిగింది. 'ఇదిగో తీసుకోవయ్యా! ఈ పదికాసులు నీ ఖర్చుకు వాడుకో!' అని చెప్పలేని శ్రీరామచంద్రుణ్ణి నమ్ముకున్న పోతన్నగారి తర్వాత అంతటి పిచ్చివాడెవడంటే దయానిధిగారేనని చెప్పాలి. అన్నట్టు ఈయన చేస్తున్నదిగూడా వ్యవసాయమే! రెండెకరాల మడిపైన వచ్చే గింజలు తిండికి సరిపోయేటట్టున్నాయి. ఆ పొలం మధ్యనే చిన్న డాబా

ఒకటి వేసుకున్నాడట! అందులో సగం మేరకు లైబ్రరీయేనట! ఆ లైబ్రరీయే ఈయన సామ్రాజ్యం. సామ్రాజ్యాధీశుడికోసం సామంత ప్రభువులు రావడం పరిపాటి. ఈ సారస్వత సామ్రాజ్యాధిపత్యంకోసం పాఠక మహాశయుల్లో ఒకరు గాకపోతే ఒకరు మునగాలపాడుకు వెళ్తుంటారట! వెళ్ళినవారికల్లా గోంగూర పచ్చడితో, ఆవకాయతో, గేదె పెరుగుతో కమ్మటి భోజనం. ఆపైన సాహిత్య సమారాధనం. కమ్మటి భోజనం సుఖమా? దయానిధిగారి సన్నిధిలో సాహిత్యోపాసన సుఖమా? ఏమో, త్యాగయ్యగారిలాంటి పాఠకుణ్ణి అడగాలి.

జనంలో చొచ్చుకుంటూ పురమందిరం ఎదుటకు వెళ్ళి నిల్చునేసరికి మైకులో నుంచీ ఎవరిదో ప్రసంగం వినిపిస్తోంది. –'దయానిధిగారిని గురించి ఎందరో పెద్దలు యిదివరకే ప్రసంగించి వున్నారు. మనం విన్నాం. కొత్తగా చెప్పడానికి నాకు మిగిలిందేమీ లేదు. దయానిధిగారి కవిత్వమన్న సూర్యుణ్ణి చూపించడానికి నేను దివ్విటీ తెచ్చుకోలేదు. కానీ ఆయనపట్ల నాదొక బాధ్యత వుంది. అదేమిటంటే, కృతజ్ఞత చెల్లించడం! మేలు చేసిన వాళ్ళకు కృతజ్ఞత చెప్పడం సంప్రదాయం. ఈ విషయంలో నేను చాలా ఆలస్యం చేశాను. అయినా సరైన సమయంలో, సరైన సందర్భంలో ఈమాట చెప్పుకోగలుగు తున్నందుకు నాకు చాలా సంతోషంగా వుంది. వృత్తిరీత్యా నేను అడ్వొకేటుని! కానీ లాయరని అనిపించుకోడంకన్నా కవిననిపించుకోవాలన్న కోరిక నాలో ప్రబలంగా వుండేది. అప్పట్లో దయానిధిగారు నన్నెంతో ప్రోత్సహించారు. వారికి చదివి వినిపించి, వారి సూచన మేరకు సవరింపబడిన తర్వాత నా కవిత శంఖంలోపోసిన తీర్థంలా ఆస్వాదనీయంగా వుంటూ వచ్చింది. కానీ నేనాయనకు కృతజ్ఞత చెప్పదలచుకున్నది యిందుకుగాదు. ఆయన నాకు చేసిన మహోపకారం యింకొకటుంది. అదేమిటంటే...'

మాట్లాడుతున్న వ్యక్తి ఏ కారణంవల్లనో కొద్ది క్షణాలు విరామం యిచ్చాడు.

ఆ విరామంలో వక్తని గురించి వాకబు చేశాను. పేరు సత్యారావని, వూరు పలమనేరనీ తెలియవచ్చింది.

'ఏమిటంటే...' – సత్యారావు ప్రసంగం కొనసాగిస్తున్నాడు – 'పెళ్ళిళ్లు స్వర్గంలో చేయబడతాయంటూ ఒక సామెత వుంది. అదెంతవరకూ నిజమో నాకు తెలియదు. నా పెళ్ళి మాత్రం తిరుచానూరు సత్రంలో జరిగింది. పెళ్ళయ్యాక యింటికి తిరిగి వచ్చాము. పోస్ట్‌మెన్ ఓ కవరు తీసుకొచ్చి యిచ్చాడు. దయానిధిగారి దస్తూరీ నాకు బాగా గుర్తే. కవరువిప్పి చూద్దునుగదా, అందులో ఓ కవరింగు లెటరుతో బాటుగా యింకొక చిన్నకవరు కనిపించింది. గబగబా ఉత్తరం చదువుకున్నాను. 'ప్రియమైన సత్యారావూ! నీ పెళ్ళికి నేను రాలేకపోయాను. అన్యథా భావించవద్దు. నా శుభాకాంక్షలు మీ కెప్పుడూ వుంటాయి. ఈ శుభసమయంలో మీకెన్ని అమూల్యమైన కానుకలైనా యివ్వాలనే వుంది. ఉండి ఏం లాభం? ఇందులోని చిన్న కవరును నువ్విప్పుడే విప్పవద్దు. తొలినాటి రేయి మీ భార్యాభర్తలిద్దరూ దీన్ని విప్పి చదువుకోవలసింది. నేను మీకివ్వగలిగిందల్లా ఒక చిన్న సలహా...' అంటూ చిట్టచివర సంతకంతో ఉత్తరం పూర్తయింది. మేష్టరుగారి మాట శిరోధార్యం. ఆయన చెప్పినట్టే తొలినాటిరేయి ఆ కవరు విప్పి చదువుకున్నాం. అందులోని సలహామేరకు నడచుకోవాలని ప్రతిజ్ఞ తీసుకున్నాం. అయ్యలారా! అన్యథా భావించకపోతే

నేనొక మాట చెప్పాలి. దయచేసి అతిశయోక్తి అనుకోకండి. ఆత్మస్తుతిగా భావించకండి. మాది అన్యోన్యదాంపత్యమనీ, మేము ఆదర్శదంపతులమనీ మమ్మల్ని తెలిసినవాళ్ళందరూ అనుకుంటారు. అదే నా విశ్వాసంగూడా!'

సన్మానసభ యింకా జరుగుతుండగానే నేను ముందుకు సాగిపోయాను. నిజానికి సత్యారావు మాటలు అప్పటికప్పుడు నాపైన చూపిన ప్రభావం తక్కువే! కానీ మననం చేసినకొద్దీ మహిమ హెచ్చిన మంత్రంలా కాలక్రమాన అదొక తీరని జిజ్ఞాసగా పరిణమించింది. దయానిధిగారు సత్యారావుగారికిచ్చిన సలహా ఏమైవుంటుంది? ఆనందప్రదమైన సాంసారిక జీవనానికి నికరమైన దారిచూపే పక్షంలో దాన్ని గుప్తంగా వుంచుకోడం అన్యాయం. గోపురంపైన కూర్చుని రామానుజుడు వేదార్థాలు వల్లించినట్లుగా ఈ రహస్యాన్ని బాకాలుపెట్టి దశదిశలకూ ప్రచారం చేయవలసిన అవసరం ఎంతయినా వుంది. అవకాశం దొరికితే ఈ సత్కార్య నిర్వహణను నేనొక మహద్భాగ్యంగా భావిస్తాను.

కానీ ఆ రహస్యాన్ని తెలుసుకోడం ఎలా?

ఆ ప్రశ్న సమాధానం స్ఫురించకుండానే రెండేళ్ళు దొర్లిపోయాయి. మొన్నటికీ మొన్న వేరే పనిమీద పలమనేరు వెళ్ళవలసి వచ్చింది. పనిలో పనిగా సంసారాల్లో శాంతినీ, కాంతినీ వెలయింపచేసే ఆ గోసాయి చిట్కానుగూడా తెలుసుకురావాలన్న దృఢ నిర్ణయంతోనే బయలుదేరాను.

నేనా వూరికి వెళ్ళినరోజు శనివారం. మరునాటి ఉదయం సత్యారావు ఇంటిని వెదుక్కుంటూ బయల్దేరాను. అది తాలూకా కేంద్రం. అక్కడున్న పన్నెండు మంది లాయర్లలోనూ సత్యారావు కాస్త లెక్కకొచ్చిన వాడిలాగానే కనిపించాడు. ఎంత చిన్న పసిపిల్లవాడైనా సత్యారావు యింటికి సరైన రెక్కమానుగానే వ్యవహరించాడు. కాంపౌండువాల్ దాటుకోగానే చిన్న పూలతోట. పూలతోట మధ్యగా సిమెంటుబాట. ఆ బాట వసారా దగ్గర ఆగిపోతుంది. వసారా గుమ్మం హాల్లోకి తెరుచుకుంటుంది. హాల్లోనుంచీ వంటగదిలోకి, బాత్‌రూములోకి, పెరట్లోకి గుమ్మాలున్నాయి. పొందికగా, ముచ్చటైన యిల్లే కట్టుకున్నాడు సత్యారావు. వసారాలో నిలబడి మనిషి పొలకువను సూచించడంకోసం గొంతు సవరించుకోగానే 'ఎవరూ, ఎవరూ' అంటూ ఓ మనిషి బయటికి వచ్చాడు. 'అడ్వొకేటుగారున్నారా?' అన్నాను. వెయిటింగురూము తలుపుతెరుస్తూ అతడు 'వస్తారు కూచోండి' అన్నాడు.

అసలింతకూ సత్యారావును సంధించడానికి సిద్ధపడిన తర్వాత అందుకొక కారణం తయారుచేసుకోవాలిగదా! దారిపొడుగునా అదే ఆలోచనలో వున్నాను. ఆ కారణం నా ప్రయోజనం నెరవేరడానికి ఉపకరించడం ముఖ్యం. కథకుణ్ణి గాకుంటే, క్లయింటుగానే నేను సత్యారావును కదపగలనేమో! అందుకని నేనొక కట్టుకథను అల్లి పెట్టుకున్నాను. మా ఆవిడకు, నాకూ బొత్తిగా పొసగడంలేదు. నేను ఎద్దేమంటే తాను తెద్దేమంటుంది. నా రాబడికి మించిన దుబారా ఖర్చులు తెచ్చి పెడుతుంది. కాదు, కూడదని హద్దుల్లో పెట్టదలచుకుంటే, పుట్టింటికి వెళ్ళి నెలల తరబడి తిష్ట వేస్తుంది. ఈ జబ్బును నయం చేసేమందు ఏ షాపులో దొరుకుతుంది? విడాకులొక్కటే శరణ్యమనిపించడంతో నాకు న్యాయశాస్త్రంతో పని తగిలింది. కీలెరిగి వాతపెట్టేవాడెగదా

నాకిప్పుడు వకీలుగారి సలహా...

పత్రికలు తిరగవేస్తూ వెయిటింగు రూములో కూచున్నాను. ఆ గది తలుపులు కూడా హాల్లోకి తెరచుకుని వుండడంవల్ల గృహాంతర్భాగంలో కూచున్నట్టే వుంది. ఇందాక నన్ను పలకరించిన వ్యక్తి బాత్‌రూములో పిల్లలకు స్నానం చేయిస్తున్నాడు. వంటింట్లో పొయ్యిమీదవున్న పెనం దోసెల తయారీలో నిర్విరామంగా పనిచేస్తూ వుంది.

'ఎంతగా పిల్లలకు నీళ్లు పోస్తే మటుకు చెంబులు, తప్పేలాలు అలా గొంతు చించుకోవాలా?' ఆ గొంతు యజమానురాలిది.

'ఏదీ, నువ్వు చుంయ్, చుంయ్ మనకుండా దోసెలు కాల్చు చూద్దాం!'

'హవ్వ, హవ్వ' అంటూ నోరు నొక్కుకోవాల్సిన పరిస్థితి! ఇంటి నౌఖరు యిల్లాలితో మాట్లాడవలసిన తీరేనా యిది?

అంతఃపుర విద్రోహానికి బాగా అలవాటుపడినట్టున్న నౌఖరు మహాశయుడు స్నానాలు పూర్తయ్యాక బిడ్డలకు బట్టలు తొడిగాడు. 'వీళ్లకు టిఫిన్లు పెట్టొచ్చు' అంటూ వాళ్లని వంటగదిలోకి సాగనంపాడు. మళ్లీ బాత్‌రూములోకి వెళ్లి 'బాయిలర్ మరిగిపోతోంది, ఏకంగా యిద్దరికీ సరిపోవచ్చు' అన్నాడు.

'ఇంకా నయం! ఇద్దరమూ కలిసే స్నానం చేద్దామన్నావుకాదు...'

ఇంక నాకక్కడ కూర్చోవాలనిపించలేదు. అలనాటి సమావేశంలో సత్యారావు స్టేట్‌మెంటుకు, యిక్కడ యింట్లో సాగుతున్న తతంగానికి పొటావేసి చూసుకుంటే నాకు నవ్వొచ్చింది. ఇంటి యిల్లాలు నౌఖరుతో సరాగాలు పోతున్న విధానాన్నిబట్టి చూస్తే గృహస్వామి యిప్పుడిప్పుడే తిరిగివచ్చే జాడలు కానరావడంలేదు. అవతల వూళ్లో నాకింకా కొంతపని మిగిలివుండిపోయింది. సత్యారావును కలుసుకోవలసిన అవసరం వున్నదీ, లేనిదీ తేలిగ్గా నిర్ణయించుకోవాలి. ఆనాటి మధ్యాహ్నం భోజనమైన తర్వాత హోటల్ గదిలో పడుకుని వుండగా నా ఆలోచన మళ్లీ పెండింగు ఫైలు మీదికి వెళ్ళింది. కొత్తగా తెలిసిన వర్తమానంతో సత్యారావు కథను పూర్తి చేయడానికున్న అవకాశాలను గురించి నాలో విచికిత్స బయల్దేరింది. దయానిధిగారి లోకజ్ఞతను అవహేళన చేసినట్టవుతుంది గనుక అప్పుడీ కథతో ఆయన సత్యారావు దంపతులకిచ్చిన సలహాను చొప్పించడం అనవసరేమేమో! ఈ సత్యారావు అనే వ్యక్తి అమాయికుడైనా కావాలి. లేదా భార్య ప్రవర్తనను కప్పిపెట్టదలచుకునే గడుసువాడైనా కావాలి. ఈ రెండింటిలో ఏ వూహ నిజమనేది ఒకసారి సత్యారావుతో మాట్లాడితేగాని బోధపడదు.

ఏది ఏమైనా సాయంకాలం ఆరు గంటల బస్సులో నేను తిరుగుప్రయాణం చెయ్యవలసి వుండడం తప్పనిసరి! ఆలోగా సత్యారావుతో ఒకసారి మాట్లాడగలిగితే, పెండింగు ఫైలును ఏదో ఒక విధంగా క్లోస్ చేసే చొరవ నాకు లభించవచ్చు.

అందుకని మళ్లీ ఒకసారి సత్యారావుతో భేటీ కావడంకోసం ప్రయత్నించాను. ఈసారి సత్యారావు యింటికి వెళ్లేసరికి గంట మూడున్నర, ఆఫీసు రూంలో టైప్ రైటింగు యంత్రం టకటకలు వినిపిస్తున్నాయి. ఓ అడుగు లోపలికి వేశానో లేదో అత్యద్భుతంగా సింగారమైవున్న లేడీ టైపిస్టు ఎర్రటి మెడను ముందుకుసాచి 'ఎవరండీ?' అని ప్రశ్నించింది. 'అడ్వొకేటుగారున్నారా?' అని ప్రశ్నించాను. 'నిద్రపోతున్నారు. వచ్చేస్తారుగానీ కాసేపు వెయిటింగు రూములో కూచోండి' అంది టైపిస్టు.

ఉదయంలాగే సాయంకాలంగూడా పత్రికలే శరణ్యంగా పదిపదిహేను నిమిషాల వరకూ గదిలో కూచున్నాను.

వెయిటింగు రూముకులాగే, ఆఫీసుగదికిగూడా హాల్లోనుంచీ ప్రత్యేకద్వారం వుండివుండాలి. ఆ తలుపులు తెరచుకునే సవ్వడి వినిపించింది. పాదరక్షల చప్పుడుగూడా వినవచ్చింది.

'అప్పుడే అయిపోయిందా నిద్ర?' – లేడీ టైపిస్టు పరామర్శ.

'ఏదీ, నిద్రపోనిస్తే గదూ! నా చిన్నతనంలో మా అమ్మమ్మ ఒకావిడ యిలాగే తలంటుతుండేది! పాపం, శ్రమపడ్డావుగానీ, కాఫీ తీసుకో!'

హద్దిరభన్నా! అయ్యగారికి లేడీ టైపిస్టుతో పరాచికాలన్నమాట! హచ్చా! బాగుంది, బాగుంది, నా కథ రసకందాయంలో పడినట్టే తోచింది.

'ఎలావుంది కాఫీ?' ఈసారి పరామర్శించేవంతు అడ్వొకేటుగారిది.

'అయ్యగారి హస్తవాసిని గురించి కొత్తగా చెప్పేది ఏముంది? షరామామూలే! నా చిన్నప్పుడు మా నానమ్మ చేస్తుండిన పానకంలా వుంది.'

'ఆడపిల్లలు పుడతారట! అబద్ధమాడొద్దు...'

'సరాగాల మోతాదు తగ్గించాలి. అవతల వెయిటింగురూములో క్లైయింటున్నాడు.'

'హాలిడేలోగూడా క్లైయింట్లొస్తున్నారా? ఉదయం ఒకాయన లుంగీ కట్టుకుని, అర చొక్కా వేసుకుని నేను కనిపించేసరికి, నన్ను అసలు సిసలు పనిమనిషనుకున్నాడు. నువ్వు ప్లేట్లో టిఫిను పెట్టేశానని చెప్పావుగదూ, అప్పుడు నేను రోడ్డుపైకి వెళ్ళి కాస్త ఆలస్యంగా వచ్చిందందుకే! ఎవరోగాని, ఎలా వచ్చాడో అలాగే మాయమైపోయాడు పాపం!'

చిట్టచివరి మాట వినవచ్చేసరికి నేను మళ్ళీ రోడ్డుపైనవున్నాను!

***

మీరే ఒట్టు పెట్టుకోమంటే ఆ ఒట్టు పెట్టుకుంటాను. దయానిధిగారు సత్యారావు కిచ్చిన సలహా ఏమిటో నాకీనాటికీ తెలియదు. కానీ దొరికిన క్లూలద్వారా నేనొక కంక్లూషన్‌కు రాగలిగాను. సత్యారావు తాను కోర్టులో లాయరుగా రాణించడం ఎంత ముఖ్యమనుకుంటున్నాడో తన యింట్లో తన పనులు తాను చేసుకుపోవడంగూడా అంతే ముఖ్యమనుకుంటున్నాడు. అతడి భార్య దోసెలు కాల్చడంలాగే, టైప్‌చెయ్యడంగూడా గృహకృత్యాల నిర్వహణలో ఒక భాగంగానే భావిస్తోంది. హెచ్చు తగ్గుల ప్రసక్తి లేదు. భరించేవాళ్ళులేరు. భరింపబడే వాళ్ళూలేరు. ఒక ఆడది, మగవాడు ఉత్తమ స్నేహితులుగా జీవితాంతం సహజీవనం చేయడానికి సిద్ధపడడమేనంటూ అన్యోన్య దాంపత్యానికొక కొత్త నిర్వచనం యిచ్చుకోవాలనిపిస్తుంది. బహుశా ఈ నిర్వచనానికి మూలభూతమైన సత్యమేదో దయానిధిగారిచ్చిన సలహాలో వుండి వుండొచ్చు.

❖ ఆంధ్రపత్రిక – జూన్, 1973 ❖